పర్యావరణాన్ని పరిరక్షించాలి


మొక్క నాటుతున్న వెల్లాల రామ్మోహన్

సనత్‌నగర్: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అన్నారు. లింగయ్యనగర్‌లో గురువారం ఆయన మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ కాలుష్యం నుంచి భవిష్యత్ తరాలకు విముక్తి కలిగించాలంటే మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. శ్రీకాంత్‌రెడ్డి, చలం, అభినవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

అడ్డగుట్ట: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డిస్ట్రిక్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి శైలజ అన్నారు. తుకారాం గేట్ వడ్డెరబస్తీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, యాక్షన్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో గురువారం మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, సోషల్ మీడియా వల్ల జరిగే అనర్థాలను ఎలా అధిగమించాలి అనే విషయాలను వివరించారు. మహిళలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యాక్షన్ ఎయిడ్ సంస్థ సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పాఠశాలకు వితరణ


ఉపాధ్యాయురాలికి ఫ్యాన్, ట్యూబ్‌లైట్లు అందజేస్తున్న శ్రీనివాస్

రసూల్‌పురా: రసూల్‌పురా కట్టమైసమ్మ అంగన్‌వాడీ పాఠశాలకు బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్ సీలింగ్ ఫ్యాన్, ట్యూబ్‌లైట్లు, ఫ్లోర్ మ్యాట్స్‌ను గురువారం వితరణ చేశారు. కనీస ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయురాలు తన దృష్టికి తీసుకరావడంతో సొంత ఖర్చులతో అందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయురాలు శీలాబాయి, ఆయా సుకన్య, స్థానిక నేతలు కుమార్ ముదిరాజ్, శ్యాంరెడ్డి, కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి సహకరించండి


జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఇటీవల జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమ్రపాలిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఏకైక జీహెచ్‌ఎంసీ డివిజన్ మోండా మార్కెట్‌లో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. వర్షాకాలం నేపథ్యంలో కంటోన్మెంట్ పరిధిలోనూ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సేవలు విస్తరించాలని కోరారు. అలాగే త్వరలోనే కంటోన్మెంట్ ప్రాంతం జీహెచ్‌ఎంసీలో కలిపేందుకు సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న చర్యలపై ఆమెతో చర్చించారు.

అదనపు కమిషనర్‌తో కార్పొరేటర్ సమావేశం



అదనపు కమిషనర్‌తో కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ సునంద రాణితో సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పలు సమస్యలను ఆమెకు వివరించారు. సమస్యాత్మకంగా మారిన పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసేందుకు హార్టికల్చర్ సిబ్బంది సంఖ్యను పెంచడంతో పాటు, అవసరమైన పనిముట్లు అందజేయాలని కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని ఆయా ఆలయాల్లో బోనాల నిర్వహణకు గత ప్రభుత్వం చేసిన ఆర్థిక సహాయంపై విచారణ చేపట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బన్సీలాల్‌పేట్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఐ. చిరంజీవి దేవాదాయ శాఖ కమిషనర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐడీహెచ్ కాలనీ, భోలక్‌పూర్, హమాల్‌బస్తీ, పద్మారావునగర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల చెక్కుల పంపిణీలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. ఆలయ కమిటీలు, బస్తీ ప్రజలకు చేరాల్సిన డబ్బులను బీఆర్‌ఎస్ నాయకులు తమ పేరిట చెక్కులు మంజూరు చేయించుకున్నారని ఆరోపించారు. వీటిపై సమగ్రమైన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో బోనాల వేడుకల కోసం అందజేస్తున్న ఆర్థిక సాయం చెక్కులు బస్తీ ప్రజలకు అందేలా చూడాలన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిన కొడారి రాజు



సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ నార్త్‌జోన్ కార్మిక నాయకుడు, భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు కొడారి రాజు గురువారం ఐఎన్‌టీయూసీలో చేరారు. సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమానికి ఐఎన్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్‌షరీఫ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజుతోపాటు 200 మంది కార్మికులను తమ యూనియన్‌లో చేర్చుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శంకర్, ప్రభాకర్, బాలకృష్ణ, బాగేశ్వర్, నర్సింగ్‌రావు, విజయ, లక్ష్మణ్, మధు, కామరాజు పాల్గొన్నారు.

అడుగడుగునా నిర్వహణ లోపం..!

- ముగిసిన ఎల్లమ్మ కల్యాణోత్సవం
- పోలీసుల అత్యుత్సాహంతో ప్రభుత్వం అప్రతిష్ట పాలు
- సౌకర్యాలూ అంతంతమాత్రమే
- పలు వర్గాల ఆగ్రహానికి గురైన అధికారులు


బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి రథోత్సవం

సనత్‌నగర్/అమీర్‌పేట: మూడు రోజుల పాటు జరిగిన బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవాలు ముగిశాయి. అయితే ఈసారి అడుగడుగునా పోలీసుల అత్యుత్సాహంతో ప్రభుత్వం అప్రతిష్ట పాలయ్యింది. సాక్షాత్తూ రాష్ట్ర మంత్రులే ఈ విషయమై సీరియస్ అయ్యారంటే వారి ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. కల్యాణోత్సవం రోజే అనుకుంటే రథోత్సవంలోనూ వారి దురుసు ప్రవర్తనతో రోజూ ఈ రచ్చ..ఏంటంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు క్యూలైన్ల నిర్వహణ కూడా సరిగా లేదని భక్తులు మండిపడ్డారు. గతంలో వీవీఐపీలు, వీఐపీలు, జనరల్ పబ్లిక్, డోనర్స్‌కు ఇలా నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేసేవారు. కానీ ఈసారి కేవలం రెండు క్యూలైన్లకే పరిమితం కావడంతో తోపులాటలకు ఆస్కారం ఇచ్చినట్లయ్యింది. దీంతో డోనర్స్, కల్యాణం టికెట్లు తీసుకున్నవారు, వీఐపీలను ఒకే లైన్ ద్వారా పంపించడంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. వారంతా దర్శనానికి వెళ్లే క్రమంలో గంటల పాటు సామాన్య భక్తుల క్యూలైన్ కదలికలో విపరీతమైన జాప్యం ఏర్పడింది. కల్యాణం రోజు మంగళవారం రాత్రయినా కూడా భారీగా క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఇదిలాఉంటే భక్తులకు చెందిన 20 ఫోన్లు, తులం బంగారు చైన్‌ను దుండగులు చోరీ చేశారు.

ముందస్తు సమీక్షలు లేకపోవడంతోనే..

అమ్మవారి కల్యాణం వస్తుందంటే నెల రోజుల ముందు నుంచే ఏర్పాట్ల ప్రక్రియను ప్రారంభించేవారు. కానీ ఈసారి కల్యాణం జరిపించిన అనుభవం లేని ఆలయ కార్యనిర్వాహణాధికారి తీరుతో కనీసం వారం ముందు నుంచైనా ఏర్పాట్లు జరగని పరిస్థితులు ఉన్నాయి. పోలీసులకు కూడా దిశా నిర్దేశం అంతగా చేసినట్లు కనిపించలేదు. ఎవరిని ఎటువైపు పంపించాలి, ఎలా వ్యవహరించాలనే విషయాలపై ఎలాంటి అవగాహన లేకుండా నేరుగా బందోబస్తు విధుల్లోకి వచ్చేయడంతో అభాసుపాలయ్యారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వివిధ వర్గాల నుంచి వ్యతిరేకత..

ఈసారి కల్యాణోత్సవంలో పలు వర్గాల వ్యతిరేకతను దేవాదాయ శాఖ అధికారులు మూటగట్టుకున్నారు. ముఖ్యంగా రూ. 10 లక్షలు ఇచ్చిన డోనర్స్‌కు మాత్రమే ప్రత్యేక దర్శనం కల్పించారని, రూ. 2, 3 లక్షలు ఇచ్చిన వారిని పక్కనబెట్టారన్న విమర్శలు వచ్చాయి. అంతేగాకుండా కల్యాణం టికెట్స్ కోసం డబ్బులు చెల్లించినా ఆ ప్రదేశంలోకి అనుమతించలేదని ఇంకొందరు పేర్కొన్నారు. ఇక వీఐపీ పాస్‌ల సంఖ్య గతేడాది కంటే చాలా తక్కువగా ప్రింట్ చేసినప్పటికీ వాటిని కల్యాణం ముందు రోజు వరకు ఇవ్వకపోవడంతో స్థానికుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అలాగే కల్యాణానికి నెల రోజుల ముందే పాలకమండలి సభ్యులను నియమించేవారు. కానీ ఈసారి కేవలం ఐదారు రోజుల ముందు ప్రకటించడంతో వారు ఏం చేయాలో కూడా తెలుసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. కేవలం వీఐపీ పాస్‌లను తీసుకోవడానికే పాలకమండలి సభ్యులు పరిమితమయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు జర్నలిస్టులు, గర్భిణుల విషయాల్లో కూడా కొంతమంది పోలీసులు దురుసుగా వ్యవహరించడం, మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యక్తిగత ఫొటోగ్రాఫర్‌పై దూకుడు ప్రదర్శించడం, జోగినీలు, శివసత్తులను పట్టించుకోలేదంటూ ఆయా వర్గాల ఆగ్రహానికి గురయ్యారు.

జీహెచ్‌ఎంసీలో విలీనంతోనే అభివృద్ధి

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్


వాసవీ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: జీహెచ్‌ఎంసీలో విలీనంతోనే కంటోన్మెంట్ సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఐదోవార్డు వాసవీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇన్నాళ్లు కంటోన్మెంట్ బోర్డు కారణంగా అధికారుల్లో జవాబుదారీతనం, బాధ్యత లేకపోవడంతో సకాలంలో ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం లేకపోవడం వల్ల సమస్యలు మరింత జటిలం అవుతున్నాయని పేర్కొన్నారు. సీఎం చొరవతో వీలైనంత త్వరగా కంటోన్మెంట్ ప్రాంతం జీహెచ్‌ఎంసీలో విలీనం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కాలనీలో పర్యటించి రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర సమస్యలను పరిశీలించారు. దోమల బెడద తీవ్రంగా ఉందని, అయినా బోర్డు అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందిస్తూ త్వరలోనే బోర్డు అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి, మౌలిక సదుపాయాల కల్పన విషయంలో ప్రణాళిక రూపొందించేలా ఆదేశిస్తానన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, ఉపాధ్యక్షుడు బొజ్జ అజయ్, అసోసియేషన్ మెంబర్ తేలుకుంట అరుణ్ జ్యోతి సతీశ్ గుప్తా, భాస్కర్, కోట నాగేశ్వరరావు, రేపాల వెంకటేశ్వర్లు, రవీకాంత్, తేరాల శ్రీనివాస్, అమర్నాథ్, వసుంధర అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌ల తొలగింపు

'సాక్షి' ఎఫెక్ట్‌తో కదిలిన యంత్రాంగం



సాక్షిలో ప్రచురితమైన కథనం


వాహనాలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

లాలాపేట: తార్నాక, లాలాపేట ఫ్లైఓవర్ అక్రమ పార్కింగ్‌లు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనంపై సాక్షి దినపత్రికలో 'అక్రమ పార్కింగ్ స్పందించరేం' శీర్షికన గురువారం ప్రచురితమైన కథనానికి నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఇన్‌స్పెక్టర్ రాంబాబు ఆధ్వర్యంలో సిబ్బంది క్రేన్ సహాయంలో ఫ్లైఓవర్ కింద అక్రమంగా పార్క్ చేసిన వాహనాలను తరలించారు. కొన్ని వాహనాలకు నో పార్కింగ్ చలాన్లు విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాంబాబు మాట్లాడుతూ నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపవద్దన్నారు. రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలాఉంటే అక్రమ పార్కింగ్ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేసిన సాక్షి దినపత్రికకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

బోర్‌వెల్ నీటిని అందరికీ అందించాలి


బోర్డు ఇంజినీర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సతీశ్ గుప్తా

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఐదోవార్డు సంజీవయ్యనగర్ బాయిగడ్డ బస్తీలోని బోర్‌వెల్ నీటిని అందరికీ అందేలా చూడాలని కాంగ్రెస్ నేత తేలుకుంట సతీశ్ గుప్తా బోర్డు అధికారులకు విన్నవించారు. బస్తీలోని కొందరు స్థానిక పెద్దలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కొందరికి నీటిని సక్రమంగా విడుదల చేయడం లేదని, దీనికితోడూ డబ్బులు డిమాండ్ చేస్తున్నారని స్థానిక మహిళలు కొందరు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారిని తీసుకుని నేరుగా బోర్డు కార్యాలయానికి వెళ్లారు. తాగునీటి విభాగం ఇంజినీర్ సావన్‌ను కలిసి సమస్యను వివరించారు. బోర్‌వెల్ నిర్వహణ బాధ్యతల విషయంలో అధికారులు తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రమేశ్, శ్రీలత, రాధిక, మధు, మమత తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

గాంధీఆస్పత్రి : అస్వస్థతకు గురై గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీజేపీ రజక సెల్ నాయకుడు కృష్ణ సతీమణిని మాజీ మేయర్, బీజేపీ నాయకురాలు బండ కార్తీకరెడ్డి గురువారం పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు, ఆర్‌ఎంఓలు జయకృష్ణ, యోగేంధర్‌తో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. డెంగీ, డయేరియా, వైరల్ ఫీవర్లు వంటి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది మరింత చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని కోరారు. రజక సెల్ జిల్లా కార్యదర్శి వీరన్న, నాయకులు సంపత్, చరణ్‌రాజ్, లడ్డు, కేదార్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీ అత్యవసర విభాగ వైద్యులతో మాట్లాడుతున్న మాజీ మేయర్ కార్తీకరెడ్డి

విద్యతోనే పేదల జీవితాల్లో వెలుగు



అడ్మిషన్ పొందిన విద్యార్థులతో ఎస్సీఆర్పీ నాయకులు

పద్మారావునగర్: విద్యతోనే నిరుపేదల జీవితాల్లో వెలుగు చూడగలమని పలువురు వక్తలు పేర్కొన్నారు. భోలక్‌పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 'బెస్ట్ అవైలబుల్ స్కూల్' స్కీంలో ఎంపికైన పేద విద్యార్థుల అడ్మిషన్ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. బెస్ట్ అవైలబుల్ పథకం ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు కార్పొరేట్ స్కూళ్లలో ఉచితంగా విద్యనభ్యసించే అవకాశం కలిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్సీఆర్పీ రాష్ట్ర అధ్యక్షుడు డి. సుదర్శన్‌బాబు, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాస్ రావు, ఏసూరి మహేశ్ తదితరులు మాట్లాడారు. విద్యార్థులతో పాటు ఎస్సీఆర్పీ నాయకులు విజయ్‌బాబు, మహేందర్, రాపాక అశోక్, సెల్వరాజ్, కుమార్, లింగం, డి. జనార్దన్, రాంబాబు పాల్గొన్నారు.

ఓయూ క్యాంపస్‌లో ప్రశాంతం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో పోలీసుల పహారాతో గురువారం ప్రశాంత వాతావరణం నెలకొంది. డీఎస్సీ పరీక్ష వాయిదా కోసం అభ్యర్థులు చేసిన ఆందోళనలతో నాలుగు రోజులుగా అట్టుడికిన ఓయూ క్యాంపస్ హాల్‌టిక్కెట్ల జారీతో అభ్యర్థులు వెనక్కు తగ్గారు. ఓయూలో జర్నలిస్టులపై జరిగిన దాడిని ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు నెల్లి సత్య ఖండించారు. నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్న కొన్ని యూట్యూబ్ ఛానళ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఓయూ పీహెచ్‌డీ స్కాలర్ వలిగొండ నరసింహ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

ఓయూ ఇంజినీరింగ్ విద్యార్థుల పేటెంట్ పరీక్షకు ఎంపిక

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 10 మంది విద్యార్థులు పేటెంట్, డిజైన్ పరీక్షకు (గ్రూప్-ఎ) ఎంపికైనట్లు అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం పేటెంట్ కార్యాలయంలో విద్యార్థులను ఎంపిక చేసినట్లు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో 53 ఖాళీలకుగాను అందులో 10 మంది ఓయూ విద్యార్థులు ఉండడం విశేషం.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ సంపత్‌కుమార్

లాలాపేట: నల్లకుంట, చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆంధ్రమహిళా సభ కళాశాలలో గురువారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై క్రిమినల్ లా, ట్రాఫిక్ ఉల్లంఘనలకు చట్టంలో ఉన్న శిక్షలను వివరించారు. రోడ్డు ప్రమాదాలకు గల కారణాలను ప్రొజెక్టర్ ద్వారా కళ్లకు కట్టినట్లుగా చూపించారు. అలాగే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే జైలు శిక్ష ఉంటుందని సూచించారు. విద్యార్థి దశ నుంచే అందరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలన సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


శ్రావణి

బౌద్ధనగర్: యువతి అదృశ్యమైన ఘటన వారాసీగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. పార్శీగుట్టకు చెందిన రోయ్యల శ్రావణి (28) ఈ నెల 9న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు తమకు తెలిసిన వారిని, బంధువుల వద్ద వాకబు చేసిన ఆచూకీ లభించలేదు. దీంతో వారాసీగూడ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

లాలాపేట: గుర్తు తెలియని ఓ వృద్ధుడు గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్‌ఐ కాశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4న దాదాపు 65 ఏళ్ల వృద్ధుడు ఓయూ పీఎస్ నుంచి మాణికేశ్వర్‌నగర్ కమాన్‌కు వెళ్లే రోడ్డు మార్గంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని తీవ్ర గాయాలతో ఉన్న క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా చికిత్స కోసం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించి ఈ నెల 8న మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫిట్స్‌తో గుర్తు తెలియని వ్యక్తి ..



సనత్‌నగర్: ఫిట్స్‌తో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 40-45 ఏళ్ల వయస్సున్న ఓ వ్యక్తి బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మోతీనగర్‌లోని గెలాక్సీ వైన్ షాపునకు వెళ్లాడు. అక్కడ మద్యం కొనుగోలు చేసి వస్తుండగా ఫిట్స్ రావడంతో కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ప్రతిరోజూ మద్యం కొనుగోలు చేసేందుకు వస్తుంటాడని స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపైనే వ్యర్థాలు..!



అమీర్‌పేట: సనత్‌నగర్ డివిజన్ జెక్ కాలనీ సెయింట్ థెరిసా ఆసుపత్రి బ్యాక్ సైడ్ గేటుకు ఆనుకుని ఉన్న వైష్ణవి సన్‌రైజ్ అపార్ట్‌మెంట్ ఎదురుగా రోడ్డుపైనే చెట్ల కొమ్మలు ఉన్నాయి. వాటిని తొలగించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శానిటేషన్ సిబ్బందితో వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని ధర్నా


ధర్నా చేస్తున్న దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ అధ్యకుడు ప్రభాకర్ ఆంద్రూ, జోనల్ కార్యదర్శి భరణి భాను డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ రైల్ నిలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ..దక్షిణ మధ్య రైల్వేలోని 87 వేల మంది కార్మికుల్లో 98 శాతం మంది సమ్మెలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో పెట్టి పాత పెన్షన్ పునరుద్ధరణ అంశాన్ని తీసుకురావాలన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోడీ రైల్వే కార్మికులపై తన వైఖరి మార్చుకోవాలని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎంప్లాయీస్ సంఘ్ ఏజీఎస్ రుద్రెడ్డి, ఏజీఎస్ షేక్ రవూఫ్, కేవీఆర్. ప్రసాద్, ప్రభురాజ్, ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్, బ్రాంచ్ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలి

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం ఇకనైనా కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలని ఎస్సీఆర్‌ఈఎస్ డివిజన్ సెక్రటరీ ఎంజీ అరుణ్‌కుమార్ అన్నారు. నూతన పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ లాలాగూడ క్యారేజ్ వర్క్‌షాప్ వద్ద గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పెన్షన్ స్కీం వల్ల రైల్వే కార్మికులు నష్టపోతున్నారన్నారు. ధర్నాలో ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు బాబు నాయక్, చంద్రశేఖర్, సీనా నాయక్, రవీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

లష్కర్‌లో బోనాలకు విస్తృత ఏర్పాట్లు

- దేవాదాయ శాఖ సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి
- 21న మహంకాళి, 28న కట్టమైసమ్మ ఆలయాల్లో నిర్వహణ
- ముఖ్య అతిథులుగా హాజరు కానున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి
- ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ


దేవాదాయ శాఖ సికింద్రాబాద్ అసిస్టెంట్ కమిషనర్

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్‌లో బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేఎన్ సంధ్యారాణి పేర్కొన్నారు. గురువారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ సికింద్రాబాద్‌లో బోనాల వేడుకలు.. ప్రభుత్వం తరపున చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బోనాలను ఆయా ఆలయాల్లో పెద్ద ఎత్తున నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. ఈ నెల 21న సికింద్రాబాద్ మహంకాళి ఆలయంలో జరిగే బోనాల వేడుకలకు ప్రభుత్వం రూ 16 లక్షలు మంజూరు చేసిందని వాటితో భారీ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని దేవాదాయ శాఖ ఈవో ఆలయాలు సుమారు 85 వరకు ఉన్నాయని, ఆయా వేడుకలపై ఇప్పటికే ఆయా విభాగాల అధికారులతో కలిసి ఏర్పాట్లపై సమీక్షించామని తెలిపారు.

బోనాల కోసం రూ. 4 కోట్ల చెక్కుల పంపిణీ..

సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని 1,098 ఆలయాల్లో బోనాల వేడుకల కోసం సుమారు రూ. 4 కోట్ల విలువైన చెక్కులను అందజేస్తున్నామన్నారు. ఇంకా పలు ఆలయాల కమిటీలు, అలాగే కొత్తగా ఆర్థిక సాయం అందించాలని పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయన్నారు.

కట్ట మైసమ్మకు మంత్రి పొంగులేటి పట్టువస్త్రాలు..

సికింద్రాబాద్ చిలకలగూడ సుప్రసిద్ధమైన కట్టమైసమ్మ ఆలయంలో ఈ నెల 28న నిర్వహించనున్న బోనాలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తారని ఆమె తెలిపారు.